
దేశాటనం చేయించిన వాళ్ళు కూడా ఇలా చెప్పుకోరు" అంది.

రాధ గబుక్కున లోపలికి వెళ్ళిపోయింది.



"మావగారు వచ్చారు. కాళ్ళు కడుక్కునేందుకు నీళ్లు పట్టుకురా అమ్మాయ్" అని కేకేసింది సరస్వతమ్మగారు కోడలిని.

"ఉదయాన్నే వచ్చారా?" కాళ్ళు కడుక్కుంటూ అడిగారాయన.

"పొద్దున్న రయిల్లో దిగాము. అబ్బాయి స్టేషన్‌కి వచ్చాడు. అయినా వాడురాకపోయినా నేనెరగని ఊరు కనకనా!"

"ఇప్పుడు నువ్వు ఎరగవని ఎవరన్నారే? అమెరికా వెళ్ళి రాగలవు!"

కోడలు కిసుక్కున నవ్వడం చూసి "ఆ! నాకేం పనుందిట. ఊరికే ఊళ్ళమ్మట తిరగడం తప్ప! మహా

**సింగరాజు రామచంద్రమూర్తి**

# తరం మారింది


"ఎప్పుడు ఏమనాలో తెలియకుండా పోతోం దేమిటి మీకు?"

"అంటే ఏమయిందిట? కోడలు ముందు నీ ఘనత పెరిగిందే గాని తగ్గలేదులే!... ఏమన్నారు వియ్యాల వారు?"

"అనేందుకేముంది... 'ఇక్కడి ఇబ్బందులు మీరు చూస్తున్నవే కదా అక్కయ్య గారూ, పిల్లని వంటరిగా పంపక తప్పడం లేదు. ఏమాత్రం వీలున్నా వాళ్ళమ్మని మీ వెంట పంపే వాడిని' అంటూ ఇదయ్యాడు వీళ్ళ నాన్న".

"అరే పాపం... దానికింత బాధపడడం ఎందుకు? మనం లేమూ?"

"మనం ఉండడం వాళ్ళు ఉండడం అవుతుందా? వాళ్ళ పిల్లని నేను సరిగా చూడకపోతే?"



నేరకపోయి ఈ ప్రస్తావన తెచ్చాననుకున్నాడు రాజారావుగారు. కోడలు ఎక్కడ వినిపోతుందోనని చప్పున "అబ్బాయి ఆఫీసుకి వెళ్ళిపోయాడా?" అన్నాడాయన.

"రాగానే నాలుగు మెతుకులు ఉడకేసి ఆవకాయ వేసి అన్నం పెట్టాను. కమ్మగా ఇంటి తిండి తిని వెళ్ళాడు!"

"పోనీ ఒక రెండు రోజులపాటు సెలవు పెట్టమనకపోయావూ - కొత్తకాపరమా..."

"ఎందుకుట, ఆడవాళ్ళ కెదురుగా మాకు పని సాగకుండా!"

"సర్లే, తెలివితేటలకి సంతోషించాం గాని వడ్డిస్తావా? అన్నం పడేయలా?"

భోజనం చేస్తుంటే కోడలు పుట్టింటినుంచి తెచ్చిన వస్తువులు చూపించసాగింది ఆవిడ.

"ఇదిగో ఈ రెండు అన్నం ఉడకేసే గిన్నెలు, ఇవి మంచినీళ్ళ గ్లాసులు" అని నవ్వి "మంచినీళ్ళకి కాదుగాని మందుకు పనికొస్తాయి. మీలాంటివారికి ఒక గుటక్కి చాలవుట ఇందులో నీళ్ళు - ఇందాక అబ్బాయి అంటున్నాడు" అందావిడ.

"వాటికేమే, నిక్షేపంగా ఉన్నాయి. ఖరీదులు పెరిగిపోయిన ఈ రోజుల్లో కాఫీలకి చక్కగా ఉంటాయివి".

"ఖర్మ, వెనకేసుకు రావడానికి కూడా ఒక హద్దుంది. ఇవిటండీ కాఫీకి? ముఖాన కొడ తారు!"

"ఎవడుట ఆ కొట్టేవాడు?. నా ముందు నుంచోపెట్టు చెబుతాను. హోటళ్ళలో ఇంతకన్న ఎక్కువ ఇస్తారా? అయినా ఆమాత్రం ఇచ్చా మని సంతోషించక!"

ఆయన వరస ఆవిడకి ఉత్సాహకరంగా లేదు.

"సర్లెండి. అదుగో మిగిలిన సారె! ఈ సామానుతో కాపురం ఎలా చేస్తారుట? అందు కనే చెప్పేను అబ్బాయితో "సాయంత్రం అలా వెళ్ళి కావలసినవన్నీ కొని పట్టుకొని వస్తాను లెమ్మని... అసలు ఇంటికి సరిపడినవి కాకుం డా బంధువులు వస్తే కూడా వెతుక్కోకుండా ఇస్తారు. దేనికయినా సరదా ఉండాలి. నేనివ్వ లా అమ్మాయికి – ఇప్పటికీ – ఒక గ్లాసుకూడా కొనలేదు అమ్మడు!"

"అవునే మనకు కావలసినవన్నీ ఇస్తారా? వాళ్ళకు తోచినవి ఇస్తారు! అదే ఆనందంతో తీసుకోవాలిగాని, నీవరస బాగాలేదు సరుసూ" అన్నారాయన మెల్లిగా.

"అదనడం మాత్రం తెలుసు మీకు. జీవితం పొడుగునా ఇస్తారా?"

"వాళ్ళు కొనడం ఎంత బాధ్యతో మనకు తోచినవి మనబ్బాయికి మనమూ ఇవ్వాలి. తెలిసిందా".

"బుద్ధులు ఇలా ఉన్నాయి కాబట్టే జరుగు బాటు అంతమాత్రంగా ఉంది".

"వాడికి వచ్చినకట్నం ముందు నువ్వు నీ కూతురికిచ్చినదెంత" అని అడుగుదామనుకుని కోడలు వినిపోతుందని ఊరుకున్నారాయన.

## పాతబంగారం

తెలుగు కథారచయితల్లో శ్రీ సింగరాజు రామచంద్రమూర్తిది ఒక ప్రత్యేకస్థానం. సహజమైన చమత్కార సంభాషణలతో ఆయన కథలు పాఠకుల్ని ఇట్టే ఆకట్టు కునేవి.

ఆయన కథ 'షా' తానా వారి తెలుగు కథల సంచికలో చోటు చేసుకుంది. కొన్ని కథా సంపుటాలు కూడా వచ్చాయి. ఈ కథ – 'తరం మారింది' ఆయన కథా సంపుటాల్లోని ఒక ఆణిముత్యం. మధ్య తరగతి కుటుంబ వాతావరణం, చిరు సమ స్యలు, సుస్మితమైన పరిష్కారాలూ మనల్ని అలరిస్తాయి. సౌజన్యం పరిమళించే ఈ కథ మా పాఠకులకు ప్రత్యేకం.

శ్రీ సింగరాజు ఇటీవలనే విజయవాడ లో కాలం చేసారు.

ఆయనగారు అలా ఊళ్ళోకి వెళ్ళి బంధువు లను పలకరించి, స్నేహితుల ఇంట్లో కాఫీలు తాగి ఇంటికి చేరుకునే సరికి అంతా హడా వుడిగా ఉంది.

"నాన్నగారూ, మీరూ రండి. అలా బజారు కెళ్ళి ఏవో వస్తువులు కావాలంటోంది అమ్మ – కొనుక్కొద్దాం" అన్నాడు శ్రీనివాసు.

"మీ అమ్మ హడావుడికేం గానీ అసలున్నవి సరిపోతాయేమో చూడండిరా. ఏవమ్మాయ్ ఉన్నవాటితో వాడికి వండి పెట్టలేవూ?" అన్నా రాయన నవ్వుతూ కోడల్ని ఉద్దేశించి.

తన్ని నేరుగా ఆయన అడిగేసరికి కంగారు పడి అత్తగారివంక చూసింది రాధ.

"అప్పుడే పెద్ద ఆరిందా అయిందేమిటి ఆవిడ – ఏవి కావాలో అక్కర్లేదో చెప్పేందుకు?

లేకపోయినా వాళ్ళనాన్న ఇచ్చిన సామాను చాలవని చెబుతుందా? నేను వెళ్ళిపోయాక గప్‌చిప్పుగా ఒక్కొక్కటే కొనిపిస్తుంది".

ఆయన ఏం మాట్లాడలేకపోయారు.

"ఇంకా దుప్పట్లూ అవీ కూడా కావాలిట లెండి! రండి వెడదాం" అన్నాడు శ్రీనివాసు ఎటో చూస్తూ.

"నేను రానుగానీ ఆవిడ్నే వెంటేసుకుపో. షాపులన్నీ ఇంటికి పట్టిస్తుంది జాగ్రత్త. అనుభవజ్ఞుడ్ని - చెప్పకపోతే తప్పు".

కోడలితో బాటు ఆవిడ ఒక రిక్షా ఎక్కింది. రెండో దాంట్లో శ్రీనివాసు ఎక్కాడు బయలుదేరి పోతున్న రిక్షాలని చూస్తూ "దీనికి గ్రహించుకునే శక్తిలేదు" అనుకున్నారాయన.

❁ ❁ ❁

పీట వేసుకుని కూర్చున్నారు రాజారావు గారు. సరస్వతమ్మ కాఫీలు కలుపుతోంది.

"ఇల్లు చక్కటిది సంపాయించాడు వీడు. నలుగురు వచ్చినా బాధ లేకుండా నిక్షేపంగా సరిపోతుంది... మీ నాన్న ఎప్పుడొస్తానన్నారమ్మాయ్?"

"ఏమోనండి నేనడగలేదు" అంది రాధ మెల్లిగా.

"మనింటికి రమ్మనమని వాళ్ళని అడగద్దూ?... ఏమే నీవయినా చెప్పకపోయావు?"

"అదెటూ చెప్పే ఉంటుందనుకున్నాను"

"అప్పుడే అదెలా చెబుతుందే? పెద్దదానివి నువ్వెందుకున్నట్టు? ఈ రోజు ఉత్తరం రాస్తానుండు. కొత్తకాపురం చూడడం అందరికీ సరదానే!"

"మీకూ ఉన్నాయన్నమాట సరదాలు. నేనిన్నాళ్ళూ లేవనుకున్నాను. సరేగాని వాడినిలా పిలవండి, ముఖం కడుక్కుని గదిలోకి పోతున్నాడు... అబ్బాయీ శీనూ, కాఫీ తాగి పోదువు గానీ రా"

కొంచెం సేపటికి టవలుతో ముఖం తుడుచుకుంటూ వచ్చాడు శ్రీనివాసు.

"మీ మావగారికి ఉత్తరం రాయి. వీలు చూసుకుని ఒకసారి అందరినీ రమ్మనమని. నాక్కూడా కొంచెం ఖాళీ ఉంచితే కింద నేనూ రాస్తాను" అన్నారాయన.

"అలాగే"

"ఇవాళ ఎటువైపు పెట్టించావే ఊరేగింపు?"

"అంటే?" అర్థంకాక అడిగింది సరస్వతమ్మ గారు.

"నిన్నను బట్టలకొట్లు, పాత్రసామాను వాళ్ళని ప్రోత్సహించారు. ఈ రోజు ఎవరిదో అదృష్టం?"

"రోజల్లా మీకెదురుగా కూర్చుంటాను లెండి... సరా?"

"ఉద్దేశ్యం బాగుంది గానీ నేనింట్లో ఉండనే!"

"ఈ రోజు గుడికి వెడదామందండి అమ్మ"

"నేనిల్లు కదులుతే సహించలేరురా మీ నాన్న".

"వయస్సు పెరిగిన కొద్దీ కోపం పెరుగుతోందిరా మీ అమ్మకి. అక్కడికీ పాపం గుళ్ళూ, గోపురాలు అంటుంది కానీ ఆ దేముళ్ళ వల్ల ఏం కావడం లేదు".

"మీరూ రండి గుడికి" అన్నాడు శ్రీనివాసు.

"నాక్కొంచెం పనుంది. అలా వెళ్ళి వస్తాను. ఈ రోజు సెలవు పెట్టావా?"

మాట్లాడకుండా తల్లివంక చూశాడు అతను.

"ఎందుకూ? ఇక్కడేగా – ఒక్క అరగంటలో వచ్చేయమూ?" అందావిడ.

రాజారావుగారు గబుక్కున లేచి వరండా లోకి వెళ్ళిపోయారు.

"అబ్బాయ్, నీకు నీళ్ళు తోడేస్తున్నాను. నువ్వు పోసుకుంటే మేం కూడా చకచక కాని స్తాము" అంటోంది ఆవిడ కొడుకుతో.

ఆ మాటలు విని "తన ముచ్చట తప్ప వీడి ముచ్చట చూడదు కదా!" అనుకుని నవ్వుకున్నారాయన.

క్రితం రోజులాగానే ఆడవాళ్ళిద్దరూ ఒక రిక్షా, శ్రీనివాసు ఒక రిక్షాలో బయలుదేరి, అర గంటలో అదే పద్ధతిలో తిరిగి వచ్చేశారు.

"దీనికి చెప్పవలసిందే ఇంక" అని నిశ్చ యించుకున్నారాయన.

మధ్యాహ్నం ఆయన వరండాలో కూర్చుని ఉంటే సరస్వతమ్మ గారు పక్కన చేరింది.

"ఏదో చెప్పబోయేదానిలా ముఖం పెడుతు న్నావు ఏమిటి విశేషం" అన్నారాయన సిగిరెట్టు పొగ రింగురింగులుగా వదుల్తూ. ఆవిడ ఏమీ మాట్లాడలేదు.

"ఎలా ఉంది నీ కొడుకు కొత్త కాపురం?" అన్నారాయన మళ్ళీ ఉత్సాహంగా.

"కాపరాలకేం బాగానే ఉంటాయి. మను ష్యులే మారతారు కాని!"

"ఎవరూ మారింది, ఏమా కథ?"

"ఇంకెవరూ – మీ పుత్రరత్నం"

"ఇదివరకటిలా లేడంటావు"

"మీకన్నీ వేళాకోళాలు, వెక్కిరింతాను. లేకపోతే ఇదివరకు సెలవుల కొచ్చినప్పుడు ఇడ్లీలు చేస్తానంటే 'నేను తినను. చేశావో పారేస్తాను' అనేవాడు కదూ?".

"అనడం ఏమిటీ తినక భీష్మించుకున్న రోజులు లేవూ?"

ఆవిడకి ఉత్సాహం పుంజుకుంది. "అవు నా... అటువంటివాడు నిన్నను ఇడ్లీలు వేయ మని దానితో చెప్పివెళ్లాడు. అదేమిటిరా తినే వాడివి కాదుగా" అని అడిగాను. 'నాకెప్పుడూ అవి ఇష్టమే కదమ్మా!" అన్నాడు పైగా –

"అవునత్తయ్యా, మా నాన్నగారు కూడా ఈయన వచ్చినప్పుడల్లా ఇడ్లీలే వేయిస్తారు. ఇష్టమని" అంది ఆవిడ వత్తాసుగా... ఏమిటి చెప్పండి ఈ నాటకం. నా చేత్తో చేసినవయితే తినడా! ఇప్పుడు..."


"కట్, కట్, దీనివెనకనున్న పిలాసఫీ చెబుతానాగు సరుసూ. 'ఇడ్లీ' అన్నది ఆడదానికి శ్రమతో కూడుకున్న అల్పాహారం అన్న విష యం ఒప్పుకుంటావా? ఆ మాటే వాడు చాలా సార్లు అనేవాడు! 'చేసేవాళ్ళకి ఒళ్ళు హూనం అయిపోతుందిగానీ తినేవాళ్ళకేం ఎన్నయినా పట్టించగలం' అని. కనుక అప్పట్లో నువ్వు ఒక్క దానివీ అంత శ్రమ పడడం ఇష్టంలేదు వాడికి. అలా అంటే నువ్వు వినవు. పైగా కోడలు పిల్ల చిన్నది. కాబట్టి జబ్బసత్తువకొద్దీ రుబ్బగలదు".

"ఏమో ప్రతిదానికీ టీకా తాత్పర్యం చెబు తారు మీరు. నేనేపని చేయబోయినా ఎందు కమ్మా అది చేస్తుందిగా అంటాడు వాడు... ఎప్పుడు వెళ్ళిపోదాం?"

"అప్పుడే మొహం మొత్తిందా – ఎల్లుండి ఉదయం".

సాయంత్రం శ్రీనివాసు రావడమే ఇద్దరు స్నేహితుల్ని వెంటబెట్టుకుని వచ్చాడు. వాళ్ళని హాల్లో కూర్చోబెట్టి లోపలికి వెళ్ళి, "కాఫీ కాచాలి స్నేహితులొచ్చారు" అన్నాడు రాధతో.

ఆ అమ్మాయి మాట్లాడక ముందే "నువ్వెళ్ళి




మాట్లాడుతూండు నాయనా. నిముషంలో కాస్తాను" అంది సరస్వతమ్మగారు.

రాజారావుగారు గదిలో పేపరు చదువుకుంటున్నారు.

కాఫీలు పుచ్చుకువచ్చిన తల్లిని చూసి ఒక్క నిమిషం ఆగి, "మా మదర్. వీరు తెలుసుకదమ్మా నీకు! చెల్లాయి స్నేహితురాలు సువర్చల లేదూ - వాళ్ళ అన్నయ్య ప్రభాకర్".

"నమస్కారమండీ. ఎప్పుడు వచ్చారు?"

"నిన్న వచ్చాం నాయనా. కోడల్ని తీసుకువచ్చాను. నీకామధ్య పెళ్ళయింది కదూ! సువర్చల మద్రాసులోనే ఉందిట. మొన్న పెళ్ళయినప్పుడు చూద్దాం అనుకున్నాను గాని పడింది కాదు. దానికి పిల్లలా?".

"ఇద్దరాడపిల్లలండి".

"బాగుంది నాయనా మీ ఆవిడ్ని కూడా తీసుకురాకపోయావు?"

"అదే చెప్పానండీ వీడితో. వచ్చే ఆదివారం కలిసి వస్తాముర్రా అంటే వినలేదు".

"మంచినీళ్ళు కావాలమ్మా" అన్నాడు శ్రీనివాసు.

"పట్టుకొస్తానుండు" అంటూ లోపలికి వెళ్ళింది ఆవిడ. శ్రీనివాసు ప్రభాకర్ వంక చూశాడు. ఇద్దరూ నవ్వేశారు.

గదిలో కూర్చుని ఈ తతంగం చూస్తున్న రాజారావుగారు కూడా నవ్వుకున్నారు.

సినిమాకు వెడదామన్న కొడుకు ప్రతిపాదనని తోసిపుచ్చారు ఆయన "ఏడిశావులే ఈ రోజు రెస్టు తీసుకోండి రేపు వెడదాం" అని.

భోజనాలయాక ఆరు బయట మంచం మీద పడుకున్న రాజారావుగారు భార్యని పిలిచారు.

"సరస్వతీ ఇలా రా నీతో మాట్లాడాలి" అని.

పక్కన మరో మంచం వాల్చుకొని కూర్చుంది ఆవిడ. "చెప్పండి" అని.

"పడుకున్నారా పిల్లలు?"

"ఆ"

కొంచెంసేపు మాట్లాడకుండా పడుకుని గభాలున లేచి కూర్చున్నారాయన "నేను కొన్ని విషయాలు చెబుతాను. ఓపిగ్గా విని వాటిని గురించి సరిగ్గా ఆలోచించు..."

"వీళ్ళది కొత్తకాపురం - అవునంటావా?"

"కాదని ఎవరన్నారు?"

తను మొదలెట్టిన పద్ధతి ఆయనకే నచ్చినట్లుంది. కొంచెంసేపాగి "ఒక వయస్సు వచ్చాక బంధుత్వాలు ఎలా ఉండాలో తెలుసా? నేను నీ కన్నా పెద్ద, నన్ను గౌరవించు అన్న దృష్టికన్న "స్నేహితులం" అన్న దృష్టిని పెంపొందించాలి. అప్పుడు భయభక్తుల బదులు ప్రేమ, చనువు కలుగుతాయి. అటువంటప్పుడు జీవితం సుఖంగా ఉంటుంది. లేకపోతే మొదట ఆ పరిస్థితికి సమాధానపడడం కష్టం అనుకో" అన్నారు.

"దేనికి ఈ ఉపోద్ఘాతమంతా?"

"నిన్ను గురించే. వాళ్ళు కొత్త దంపతులు. వాళ్ళకేం కోరికలుంటాయో మనగతాన్ని గుర్తు చేసుకొని గ్రహించుకోవాలి. దాని కనుగుణంగా మనం ప్రవర్తించాలి".

"నేనెలా ప్రవర్తించానేమిటి?"

"కరెక్ట్ ఇప్పుడు టాపిక్‌లోకి వచ్చాం. ఎక్కడికయినా వెడుతున్నప్పుడు రిక్షాలో నువ్వు కోడలి ప్రక్కన కూర్చునేకన్నా దాన్ని వాడి పక్కన కూర్చోపెట్టు, వాళ్ళ ప్రయాణం ఎంత సరదాగా ఉంటుందంటావు? నీళ్ళు నువ్వు తోడేకన్నా వాడు స్నానం చేసేదాకా టవలు పుచ్చుకొని దాన్ని నుంచోమను అక్కడ. అన్నం వాళ్ళని కలిసి తినమను. వాడి స్నేహితులకి కాఫీ దాంతో పంపు. సాధ్యమయినంతవరకు వాడి పనులు దానిచేతే చేయించు.

"అయితే నేను!..."

"ఆగు సరుసూ! నేను చెప్పేది పూర్తిగా విని మాట్లాడు. నువ్వు కొత్తగా కాపురానికి వచ్చినప్పుడు నీకు ఎటువంటి ఊహలుండేవో ఒక్కసారి గుర్తు చేసుకో. అప్పట్లో మన పెద్దవాళ్ళు అవి తీరకుండా చేశారు. అది మనకెంత కష్టం కలిగించిందంటావు? ఆ మొదటి రోజుల్లోనే ఆ కోరికలన్నీనూ. ఇప్పుడు అవకాశాలు ఉంటే మాత్రం లాభం ఏమిటంటావు?"

"మనకి మన పెద్దవాళ్ళు అవకాశాలు ఇవ్వలేదు. కాని మనం ఆ అనుభవం మీద ఇప్పుడు వీళ్ళకి కలిపించవచ్చుగా. చరిత్ర చర్వితచరణం కాకూడదు సరస్వతీ. ఎవరో ఒక్కరు కొత్తబాట తొక్కితే ముందుతరాల వాళ్ళు సుఖపడతారు. ప్రతిదానికీ నిన్ను ఆ పరిస్థితుల్లో ఊహించుకుంటూండు".

ఆవిడ మాట్లాడకుండా వింటోంది. ఆవిడ ముఖంలోకి పరికించి చూసి నవ్వారాయన.

"ఎందుకు నవ్వుతారు?"

"నీకు తెలుసు. ప్రతి ఆడదానికీ అటు భర్త మీద, ఇటు పిల్లలమీద కూడా అధికారం చలాయించాలని, వాళ్ళ ప్రేమకి తామొక్కరే వారసులవాలనీ ఉంటుంది. దాన్ని వారు మరొకరితో పంచుకోలేరు. నీ భర్త ప్రేమ నీ కొక్కదానికే దక్కాలని అనుకున్నట్టే నీ కోడలూ అనుకుంటుంది. అది గుర్తుంచుకోవాలి. మన బాధ్యత పిల్లల్ని పెంచడం వరకు. అప్పుడు వాళ్ళని వాళ్ళ తరంవాళ్ళకి అప్పచెప్పాలి అంటే 'షిఫ్ట్' మారుతుందన్నమాట. 'వీళ్ళెప్పుడు వెడతారు - మనం చిలకా గోరింకల్లా ఉండచ్చు' అన్న భావన వాళ్ళకి రానీయకుండా మనం ఉండగానే వాళ్ళనలా ఉండేట్లు చేస్తే మన కంటికి ఆనందంగా ఉంటుంది.

"ఆడదానికి ఆడదే శత్రువన్నారు తెలుసా? కాని అది మనింట్లో నిజం కాకూడదు. అదీ చిన్నపిల్ల. నీ కూతురు తప్పులు చేస్తే క్షమించి నట్లు దీన్నీ చూసుకో. అప్పుడు నీకిది మరో కూతురవుతుంది" అని ఆవలించి, "చాలా పెద్ద విషయాలు చెప్పాను. ఇవి శాంతియుత సహ జీవనానికి చిట్కాలు. నీకు గుర్తుందో లేదో శ్రీని వాసు కారు క్రింద పడ్డప్పుడు..."

ఆయన గుర్తు చేయకుండానే ఆవిడకంతా గుర్తుకొచ్చింది.

'అప్పట్లో ఆయన అక్కగారింట్లో ఉండే వారు. తనకి కొత్తకాబట్టి చేదోడు వాదోడుగా ఉంటుందని. మొదట తనకది బాగానే ఉన్నా రానురాను ఆవిడ పెత్తనం చెలాయిస్తున్నట్లు బాధపడసాగింది తను.

ఆయన గురించి తనకేమీ తెలియదన్నట్లు గా ఆవిడ మాట్లాడుతూంటే ఒళ్ళుమండేది తనకి. ఫలానా కూర ఆయనకిష్టం అని తనంటే ఏదో పెద్ద వింత విన్నట్లుగా "భలేదానివి చిన్న ప్పటినుంచీ వాడికది అసహ్యం" అని ఫక్కున నవ్వేసేది. పోనీ ఈయనగారు కూడా ఎటూ చెప్పేవారు కాదు.

ఇలా ప్రతి విషయంలో తన తమ్ముడు తన చేతిలోనే ఉన్నట్లు ఆవిడ మాట్లాడుతూంటే సహించలేక ఏవో సాకులుపెట్టి వేరే ఇల్లు తీసు కునేట్టు చేసింది తను. ఏకళనున్నారో తను చెప్పగానే విన్నారాయన. తరువాత కొన్నాళ్ళకి తనకి శ్రీనివాసు పుట్టాడు. మళ్ళీ వీడితో పెద్ద భాగవతం అయింది.

ఈ వెధవ మిలిటరీ కారు కిందపడ్డాడు ఒకసారి. తను హడలిపోయింది. ఉన్నది ఒక్క నలుసు. కళ్ళల్లో వత్తులు వేసుకుని కూర్చునేది వీడి దగ్గర. వీడికి ఒక స్నేహితురాలు ఉండేది సరళ అని పదేళ్ళది. అది కూడా పెద్ద ఆరిందా లాగా వీడిదగ్గరే కూర్చుని మందులు పడు తుండేది. తనచేత్తో తాగనని మొరాయించి నప్పుడు అదిస్తే తాగేసేవాడు. తనకి వళ్ళు మండేది. తన వూసే పట్టకుండా దాంతో కబు ర్లు చెబుతూండేవాడు. అది లేకపోతే దానికోసం కలవరించేవాడు.

రాను రాను తను సహించలేకపోయింది. ఆ సరళని రాకుండా చేసింది. ఒక రోజున అది రాందే మందు తాగనన్నాడు. తను తాగి తీరాలిసిందేనంది. వాడు ఏడుపు ఆ పిల్లకోసం. ఇదంతా చూసిన ఆయన వెళ్ళి దాన్ని తీసుకొ చ్చారు. దాన్ని చూస్తూ వాడు మందు తాగు తుంటే చూడలేక తను చేతుల్లో ముఖం దాచు కుని ఏడ్చేసింది.

❁ ❁ ❁

"లోకరీతే అంత సరసూ, అక్కయ్య నన్ను నీ చేతిలో పెట్టలేకపోయింది. కాపురాలు విడి పోయాయి. నువ్వు నీ కొడుకు ప్రేమని సరళతో పంచుకోలేకపోయావు. వాళ్ళింకా చిన్న పిల్ల లన్నగుర్తింపు కూడా నీకు లేకపోయింది. చిత్రం గా లేదూ!"

నవ్వింది సరస్వతమ్మ. అలాగే పడుకుంది. వెంటనే ప్రశాంతంగా నిద్రపోయింది...

ముఖం తుడుచుకుంటూ బయటికి రాబో తున్న కొడుకుని "అమ్మాయి పట్టుకొస్తుందిలే కాఫీ. పేపరు చదువుకుంటూ కూర్చో. రాధా, వాడికి కాఫీ తీసుకెళ్ళు" అంది సరస్వతమ్మ పొద్దున్న కాఫీల దగ్గర.

ఒక క్షణం ఆవిడ వంక చూసి కాఫీ పుచ్చు కుని గదిలోకి వెళ్ళింది రాధ.

రాజారావుగారు తృప్తిగా ఆవిడముఖంలోకి చూశారు. కాని, ఆవిడ పట్టించుకోలేదు.

కొంచెం సేపటికి -

"స్నానం చేయాలమ్మా" అన్న కొడుకు మాటవిని "నన్నడుగుతావేంరా? అమ్మాయ్, చూడు వీడి విషయం. నేను మడి కట్టుకుంటాను చప్పున" అంది.

రాజారావుగారు పేపరుచాటున నవ్వుకున్నారు.

"నువ్వు కూడా కంచం పెట్టుకోవే అమ్మాయి, ఇద్దరికీ వడ్డించేస్తాను".

"నేను మీతో భోంచేస్తాలెండత్తయ్యా"

"నాతో పెట్టుకుంటే ఎలా, నాకు మడీ దడీ! చిన్న పిల్లలు పెద్ద వాళ్ళతో వంతు వేసుకోకూడదు. నాకూ, ముసలాయనకీ నువ్వు వడ్డిద్దువుగాని"

ఫక్కున నవ్వింది రాధ.

"ఎందుకే నవ్వుతావు?"

రాజారావుగారు గబగబా లోపలికి వచ్చారు. "నవ్వదూ నువ్వన్న మాటకి? నేను నీ కంటికి ముసలాడినా? నేను తాతనయిన రోజున నువ్వూ బామ్మవవుతావు గుర్తుంచుకో".

ఆయనకి ఇంటి వాతావరణం బాగుంది.

ఆఫీసుకి వెడుతున్న కొడుకుని గుమ్మంలో పట్టుకుని "ఒరేయ్ అబ్బాయి, మధ్యాహ్నం సెలవు పెట్టి ఇంటికి వచ్చేయ్. సాయంత్రం సినిమాకి వెడదాం" అంది సరస్వతమ్మగారు.

శ్రీనివాసు రాధ ముఖంలోకి చూశాడు. సిగ్గుపడినట్లుగా తలవంచుకుంది ఆ అమ్మాయి...

❁ ❁ ❁

"పదండమ్మా, టయిమయిపోయింది తెమలాలి. రిక్షాలు కేకేయనా?"

"బహువచనం దేనికి? ఒక రిక్షా పిలు"

"అదేమిటి?"

"అవ్వునురా, మీ ఇద్దరికీ రెండు కావాలా ఏమిటి?"

"నువ్వు చూడవా?"

"చూడనని ఎవరన్నారు. మాట్లాడకుండా రిక్షా పిలు. రాధా ఊ... తెమలాలి".

వాళ్లిద్దరూ రిక్షా ఎక్కి వెళ్ళిపోతూంటే అటే చూస్తూ "కొత్త పాత్ర బాగానే అభినయిస్తున్నావు సరస్వతీ. కొద్దిరోజుల్లో అలవాటయిపోతుంది" అన్నారు రాజారావుగారు.

"అభినయించడం ఏమిటండీ... నిజంగా నా మనస్సుకి ఇప్పుడు హాయిగా ఉంది. తాళం వేసి వస్తాను. మనకో రిక్షా పిలవండి".

"ఆ!"

❁ ❁ ❁

ఇంగ్లీషు సినిమా చూసి కొంచెం ముందొచ్చిన చిన్న జోడీ ఇంట్లో ఎవరూ లేకపోవడం చూసి ఆశ్చర్యపడ్డారు.

"ఎక్కడికి వెళ్ళారు చెప్మా" అన్నాడు శ్రీనివాసు.

"సినిమాకేమో. అందుకే డూప్లికేటు తాళం చెవులు నాకిచ్చారు" నవ్వింది రాధ.

వీళ్ళు భోజనం చేసేంతలో లోపలికి వస్తూ...

మేమూ వెళ్ళామ్రా ఎంత బావుందని? కమ్మటిపాటలు, అచ్చం శ్రీకృష్ణ పరమాత్ముని చూస్తూన్నట్లే ఉంది" అంది సరస్వతమ్మ.

రాధా, శ్రీనివాసు ఒరకినొకరు చూసుకుని నవ్వుకున్నారు.

"ముసి ముసి నవ్వులేం నవ్వుతావే పిల్లా. పెద్దగానే నవ్వు!... లేకపోతే మీరు వెళ్ళే సిని మాలు మాకేం బాగుంటాయే?"

భోజనం చేసి బయటికి వచ్చిన రాజారావు గారికి వరండాలో మంచాలగుపడక పోవడం తో ఆశ్చర్యంతో లోపలికి వచ్చి, "అవునే... అమ్మాయిని మంచాలు వేయమను" అన్నారు.

ఆవిడ నవ్వి, గదివైపుకి చేత్తో చూపించింది. అటు చూశారు. కొడుకు పడుకునే గదివేసి ఉంది. దాని పక్కగదిలో రెండు మంచాలు వేసి తెల్లటి దుప్పట్లు పరిచి ఉన్నాయి. లోపలికి వెళ్ళి చూశారు. అగరొత్తులు కూడా వెలిగించి ఉండ డంతో గబగబ వెనక్కి వచ్చి "నీ ఏర్పాట్లా ఇవ న్నీ?" అన్నారు నవ్వుతూ.

"కొడుకుని, కోడలు పిల్లనీ అడగండి"

❁ ❁ ❁

రైలు వచ్చేందుకు ఇంకా కొంచెం టైముం ది. ముగ్గురి ముఖాల్లో దిగులు చదువుకున్న రాజారావుగారు "ఒరేయ్ అబ్బాయి, ఇటురా" అంటూ కొంచెం అసింటా తీసుకెళ్ళి "అది చిన్న పిల్ల, కొత్తకాపురం! దానికేమయినా సరదాలుం టాయి. రోజూ బజారు నుంచి ఏదోవకటి తెచ్చి పెడుతూండు - చేసుకోవడం ఇంకా చాతకాదు కదూ!... కసురుకోకు. సర్దుకుపోవాలి.

"మీ అమ్మ ఏమయినా తొందరగా మాట్లా డి ఉంటుంది, పట్టించుకోకు. దాని తత్వం మువ్వైరగంది కాదు" అన్నారు.

"భలేవారు నాన్నగారూ, అమ్మ వెళ్ళిపోతోం దని ఇప్పుడు దానికి ఎక్కడలేని దిగులూ పట్టు కుంది. 'మా అమ్మని మించిపోయారు అత్తయ్యా' అంటోంది".

"సర్లే.., అమ్మని పొగడడానికేం గానీ ఈ రెండువందలూ ఉంచుకో... అవసరానికి. కావాలంటే రాయి, పంపుతాను. ఇక పద".

సరిగ్గా అదే సమయానికి "అమ్మాయ్... వాడు కొంచెం దురుసు మనిషి. వాడు నా పోలిక - అంటుంటారు మీ మామగారు జాగ్రత్త".

"మీ పోలికయితే నేను చాలా అదృష్టవంతు రాల్ని అత్తయ్యా" అంది నిండుగా రాధ.

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి సరస్వతమ్మగారికి. "పిచ్చిపిల్ల, అసలు వెళ్ళకనేపోదును ఈరోజు. ఆయన మొండిపట్టు పడుతున్నారు. సరే గానీ, ఈ ఏభయి నీ దగ్గర ఉంచుకో. వాడి దగ్గర నుంచి కూడా తీసుకుంటూ నాలుగురాళ్ళు దాచుకో. పిల్లా జల్లా పుడితే ఉంటుంది".

సిగ్గుపడి తల వంచుకుంది రాధ.

రైల్లో అంది సరస్వతమ్మగారు కళ్ళు తుడుచుకుంటూ "ఇంకో రెండు రోజులుండా లని ఉంది నాకు - పడనిచ్చారుకాదు. అమ్మా యి కూడా గోలపెట్టింది అప్పుడే వెళ్ళకండి అని".

"అక్కడనే ఉంది సరస్వతీ అందం! మంచి వాతావరణం ఉన్నప్పుడు వెళ్ళిపోవాలి. మళ్ళా వీళ్ళెప్పుడు వస్తారా అని వాళ్ళు, ఎప్పుడు వెడ దామా అని మనం ఎదురు చూస్తుంటాము. ఆ నిరీక్షణలో అందం ఉంది. ఆత్మీయత పెరుగు తుంది".

"పిచ్చి పిల్లలు... ఇద్దరూ కళ్ళ నీళ్లు పెట్టు కున్నారు నేను వెళ్లిపోతున్నందుకు".

మనస్సులో వాళ్ళ కడుపున నాలుగు కాయ లు కాయాలని ఆవిడ ఆశీర్వదిస్తోందని తెలు సు ఆయనకి.

అందుకే నవ్వుకున్నారు. ●